## క్లుప్తంగా

### సుందరేశ్వరునికి లక్ష పత్రి పూజ



సుందరేశ్వర స్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని బాలాత్రి పుర సుందరీ సమేత సుందరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, శ్రీసూక్త విధానంలో అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన, రుద్రహోమం నిర్వహించారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. పట్టణానికి చెందిన ధూళిపాళ్ల నరసింహ సోమయాజులు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకుడు మానేపల్లి శ్రీనివాసమూర్తి, సుందర గణేష్, లక్షపత్రి పూజా కమిటీ అధ్యక్షుడు అనుపిండి చక్రధరరావు, కలిగొట్ల కృష్ణారావు, తెన్నేటి సూర్యనారాయణమూర్తి, దూర్వాసుల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

### చాగల్లులో అన్న సమారాధన

చాగల్లు: స్థానిక ప్రధాన కూడలిలోని భక్తాంజనేయస్వామి ఆలయం వద్ద ఆదివారం భారీఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. హనుమత్ వ్రత మహోత్సవాల్లో భాగంగా ఈ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### విజయవాడ ఆసుపత్రికి వెళ్లి ..



విజయవాడ ఆసుపత్రిలో రోగికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ మేరీరత్నం

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లికి చెందిన దాసరి కొండలరావు అనే వృద్ధుడు అస్వస్థతకు గురై విజయవాడలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన వృద్ధాప్య పింఛనుదారు. ఈ విషయం తెలసుకున్న అనంతపల్లి సచివాలయ-1 వలంటీర్ గురుమిల్లి మేరీరత్నం ఆదివారం విజయవాడలోని ఆసుపత్రికి వెళ్లి, కొండలరావుకు పింఛన్ అందించి వచ్చారు. మేరీరత్నంను అనంతపల్లి సర్పంచ్ కమలకుమారి, ఉప సర్పంచ్ కలం సత్యనారాయణ అభినందించారు.

**నేడు దొమ్మేరులో పింఛన్ల పంపిణీ**

కొవ్వూరు: మండలంలోని దొమ్మేరులో సోమవారం ఉదయం పది గంటలకు కొవ్వూరు మండల స్థాయి పెంచిన వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని దొమ్మేరు సొసైటీ మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు ఆదివారం తెలిపారు. పంచాయతీ కార్యాలయం ఎదురుగా గల ప్రాంగణంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

### సారా తయారీదారు అరెస్టు

నిడదవోలు రూరల్: సారా తయారు చేస్తున్న చాగల్లు మండలం, చిక్కాల గ్రామానికి చెందిన కె.రాంబాబును మండలంలోని తాడిమళ్ల గ్రామంలో అరెస్ట్ చేసినట్టు నిడదవోలు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కె.వీరబ్రహ్మం ఆదివారం తెలిపారు. అతడి వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని చెప్పారు.

### 'వాసవి' ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు



ఆర్యవైశ్య కల్యాణ మండపంలో సంక్రాంతి సంబరాల్లో హరిదాసుల ప్రదర్శన

దేవరపల్లి: స్థానిక శ్రీవాసవీ ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం సాయంత్రం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులతో తొలుత మహిళలు ప్రదర్శన చేశారు. హరిదాసులు, జంగమదేవర ప్రదర్శనలు, ఎండ్ల బండి, భోగిమంట, భోగిపళ్లు, బొమ్మల కొలువు, పాలపొంగులు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, మహిళా సంఘ సభ్యులు వేడుకల్లో ఈ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

### కోటసత్తెమ్మ వారి ఆదాయం రూ.75 వేలు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేలాదిగా తరలి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల విక్రయం ద్వారా దేవస్థానానికి రూ.75,067 ఆదాయం వచ్చిందని ఈఓ బళ్ల నీలకంఠం(శివ). ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# యాపిల్ బేరు .. లాభాల జోరు

- దీర్ఘకాలం ఆదాయాన్ని ఇచ్చే పంట
- మిశ్రమ పంటల సాగుతో ఆదాయం పెంచుకుంటున్న రైతులు



యాపిల్‌బేర్ చెట్టు (అంతర చిత్రం) తెలికిచెర్లలో పండించిన కశ్మీర్ యాపిల్ రేగు

నల్లజర్ల: సంప్రదాయ పంటల సాగు రైతుకు గిట్టుబాటు కావడం లేదు. ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నప్పటికీ పెట్టుబడులు పెరిగిపోవడమే ఇందుకు ప్రధాన కారణం. ప్రత్యామ్నాయంగా కొందరు రైతులు పండ్ల తోటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. నల్లజర్ల మండలం తెలికిచెర్ల రైతులు చవ్వాకుల శోభన్‌బాబు, కొటికలపూడి వెంకటేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, వడ్డికాసులు ఏటా వరి సాగు చేసేవారు. పెట్టుబడులు పెరగడానికి తోడు కూలీల కొరత, నీటి ఎద్దడి సమస్యగా మారాయి. దీర్ఘకాలం ఆదాయం వచ్చేలా పంట మార్పిడి చేయాలని వారు భావించారు. ఈ క్రమంలో పండ్ల తోటలు సాగుకు ఉపక్రమించారు. ఖమ్మం జిల్లా సారపాక ప్రాంతం నుంచి కశ్మీర్ యాపిల్ బేర్ నారును తీసుకు వచ్చి రైతులంతా తలో అరెకరం విస్తీర్ణంలో నాటారు. ఎకరానికి 600 మొక్కల చొప్పున నాటారు.ఈ ఏడాది యాపిల్ బేర్ దిగుబడి బాగా వచ్చింది. ఎకరం విస్తీర్ణంలో 20 నుంచి 25 టన్నుల దిగుబడి సాధించినట్టు రైతు శోభన్‌బాబు వివరించారు. కిలో యాపిల్ బేర్ పండ్లను రూ.70 రేటుకు హోల్‌సేల్‌గా విక్రయించినట్టు చెప్పారు. ఈ విధంగా అర ఎకరం విస్తీర్ణంలోనే రూ.3 లక్షల ఆదాయం సాధించినట్టు తెలిపారు.

**అన్ని వాతావరణాలూ అనుకూలమే..**



ఎటువంటి వాతావరణ పరిస్థితుల్లోనైనా యాపిల్ బేర్ సాగు చేపట్టవచ్చు. నీటితడులు ఆలస్యమైనా ఇబ్బంది లేదు. పంట కాలపరిమితి జనవరి నుంచి ఆగస్టు వరకూ ఉంటుంది. పంట పూర్తయ్యాక కొమ్మలు కత్తిరిస్తే వచ్చే ఏడాదికి మళ్లీ మొక్క కాపునకు వస్తుంది. కూలీలతో పనిలేదు. కుటుంబ సభ్యులే సాగు చేసుకోవచ్చు. వ్యాపారులు తోట దగ్గరకే వచ్చి యాపిల్ బేర్ పండ్లను కొనుగోలు చేస్తున్నారు. ఎరువులు, పురుగు మందులతో పనిలేదు. – చవ్వాకుల శోభన్‌బాబు, రైతు, తెలికిచెర్ల

**వినూత్నంగా వివిధ రకాల పండ్ల తోటల సాగు..**



ఈ ప్రాంత రైతులు మిశ్రమ పండ్ల తోటల సాగు వైపు దృష్టి సారించారు. వారి ప్రయత్నం సత్ఫలితాలు ఇచ్చింది. ప్రస్తుతం రైతులు అధిక ఆదాయం సాధిస్తున్నారు. నలుగురు రైతులు కాశ్మీర్ యాపిల్ బేర్ సాగు చేస్తుండగా, మరి కొందరు తైవాన్ బొప్పాయి, సీడ్ లెస్ పుచ్చ, తైవాన్ జామతో పాటు లక్నో జామ, అరటి తోటలను సాగు చేస్తున్నారు.ఉద్యాన శాఖ రైతులకు కావాల్సిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తోంది. – బోడిగడ్ల సురేష్ బాబు, ఉద్యాన సహాయకుడు, తెలికిచెర్ల

# ఫైలేరియా గుర్తింపునకు రాత్రి పూట సర్వే



దూబచర్లలో రాత్రి పూట మైక్రో ఫైలేరియా నిర్ధారణ సర్వే చేస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

నల్లజర్ల: ఫైలేరియా (బోధకాలు) వ్యాధిని సంపూర్ణంగా నివారించేందుకు జ్వర సర్వే మాదిరిగా రాత్రి పూట మైక్రో ఫైలేరియా సర్వే నిర్వహిస్తున్నట్టు నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరావు తెలిపారు. దూబచర్ల గ్రామంలో రాత్రి ఏడున్నర నుంచి పదిన్నర గంటల వరకు సిబ్బంది బృందాలుగా ఏర్పడి మైక్రో ఫైలేరియా నిర్ధారణ సర్వే చేసినట్టు చెప్పారు. ఈ నెల 2న ప్రారంభమైన ఈ సర్వే 10వ తేదీతో ముగుస్తుందన్నారు. ఎంపిక చేసిన ప్రాంతాల్లో 300 రక్త నమూనాలు సేకరించినట్టు తెలిపారు. ఈ ఫైలేరియా క్రిమి రాత్రి వేళల్లో బాధితుల రక్త నాళాల్లో ఉంటుందన్నారు. దానిని గుర్తించడానికే రాత్రి వేళల్లో రక్త నమూనాలు సేకరిస్తున్నట్టు మలేరియా తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు తెలిపారు. ఈ నమూనా పరీక్షల ద్వారా ఫైలేరియా క్రిమి ఉందో లేదో గుర్తించే అవకాశం ఉందన్నారు. ఫైలేరియా వ్యాధి నివారణకు డైఈథైల్ కార్బొంజైన్ సిట్రేట్ (డీఈసీ), అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నామన్నారు. సర్వే బృందాలలో ఏఎస్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆరోగ్య సహాయకులు, ఆశ కార్యకర్తలు పాల్గొంటున్నట్టు చెప్పారు.

## సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు వాజ్‌పేయ్‌కి నివాళి



ఎస్ఎస్ వాజ్‌పేయ్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

కొవ్వూరు: సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు ఎస్ఎస్ వాజ్‌పేయ్ సంస్మరణ సభ ఆదివారం సాయంత్రం స్థానిక ఆంధ్ర గీర్వాణ విద్యా పీఠంలో జరిగింది. భారత వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆధ్యాత్మికవేత్తగా, నటుడిగా ఆత్మీయ హిత కారిణీ సమాజం, వాజ్‌పేయం వంటి సంస్థల నిర్వాహకుడిగా, రెండు సార్లు సెన్సార్ బోర్డు మెంబర్‌గా పనిచేసిన వాజ్‌పేయ్ సేవలను వక్తలు కొనియాడారు. సంస్కార భారతి అధ్యక్షుడు టీఎస్‌వీ రమణమూర్తి, మాజీ మంత్రి కారుపాటి వివేకానంద, సంస్కృత పాఠశాల రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు జీవీబీ సుబ్రహ్మణ్యం, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు గోవర్ధనం శ్రీనివాసమూర్తి, పాలకోడేటి సత్యనారాయణమూర్తి, ఇరిగేషన్ రిటైర్డు ఎస్ఈ పి.సుబ్బారావు, మన్యం గుప్తా, పలువురు ఆధ్యాత్మిక వేత్తలు, భారత్ వికాస్ పరిషత్ సభ్యులు, సంస్కార భారతి సభ్యులు పాల్గొన్నారు.

## 8 మంది పాత నేరస్తుల బైండోవర్

దేవరపల్లి: వివిధ కేసుల్లో పాత నేరస్తులైన మండలానికి చెందిన ఎనిమిది మందిని స్థానిక తహసీల్దార్ ఎం.రామకృష్ణ ఎదుట పోలీసులు ఆదివారం బైండోవర్ చేశారు. వారంతా కోడి పందేలు, రాజకీయ కొట్లాటలు, సారా కేసుల్లో పాత ముద్దాయిలని పోలీసులు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా మండలంలో కోడిపందేలు, జూదాలు వంటివి జరగకుండా 144 సెక్షన్ అమలు చేసినట్టు తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలిపారు. కోడి పందేలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## చర్చిలో పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పొందిన పేద వృద్ధులతో డాక్టర్ ప్రేమ్‌జిత్‌కుమార్, చైర్‌పర్సన్ దయా రాజగిరి

నిడదవోలు: స్థానిక రాయపేటలోని మెంటే సుందరరావు మెమోరియల్ లూథరన్ టౌన్ చర్చి సంఘ సేవకుడు, గుడ్ సమరిటన్ సంస్థల వ్యవస్థాపకుడు మెంటే రాజగిరి 13వ వర్ధంతిని శనివారం పట్టణంలోని ఆ చర్చిలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన వరంగల్‌కు చెందిన మిషన్ ఇండియా రీజినల్ డైరెక్టర్, రెవరెండ్ డాక్టర్ ప్రేమ్‌జిత్‌కుమార్, పోలవరం ప్రాజెక్ట్ లెఫ్ట్ కెనాల్ డిప్యూటీ కలెక్టర్ జి.మమ్మీ తదితరులు రాజగిరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలు, వృద్ధులు, అన్నార్థులకు రాజగిరి అందించిన సేవలను వారు కొనియాడారు. సంఘంలోని పేద వృద్ధులకు చర్చి చైర్‌పర్సన్ మెంటే దయా రాజగిరి నూతన దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్, రెవరెండ్ మద్దా విజయభాను, కిరణ్మయి, కె.సుజ్ఞానరాజు, డి.విజయకుమార్, మేడేపల్లి ప్రవీణ్‌కుమార్, సుహాస్‌రాజ్ ఐజాక్, జ్ఞానకుమారి, స్వాతి ప్రవీణ్, పిల్లి సురేష్, మల్లయ్య, స్త్రీల సమాజం సభ్యులు పాల్గొన్నారు.

## 45 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు

నల్లజర్ల: సారా విక్రయిస్తున్న మండలంలోని జగన్నాథపురం గ్రామస్తుడు ఐనాల శ్రీనివాస్‌ను అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఈబీ సీఐ డి.సుధ తెలిపారు. అలాగే మండలంలోని చోడవరం గ్రామానికి చెందిన తొంటా సత్యనారాయణను అరెస్టు చేసి, అతడి వద్ద నుంచి 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు ఆమె చెప్పారు. వారిద్దరినీ రిమాండ్‌కు తరలించామన్నారు.

## భీమేశ్వరరావు మృతికి సంతాపం

చాగల్లు: చాగల్లు సొసైటీ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ నాయకుడు వర్ధినీడి భీమేశ్వరరావు మృతికి ఆ పార్టీ శ్రేణులు ఆదివారం సంతాపం తెలిపాయి. చాగల్లులోని భీమేశ్వరరావు ఇంటి వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమేశ్వరరావు కుమారుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ చినబాబు, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంద్రోతు సురేంద్రకుమార్, పార్టీ మండల శాఖ గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు, నాయకులు గంగవరపు రాజేంద్రప్రసాద్, బొర్రా రజనీప్రసాద్, పిండి మంగరాజు పాల్గొన్నారు.

## వికలాంగుడికి 'మానవత' ట్రై సైకిల్ అందజేత



అనంతపల్లిలో వికలాంగుడికి ట్రై సైకిల్ అందిస్తున్న మానవత సంస్థ సభ్యులు

నల్లజర్ల: అనంతపల్లిలో వికలాంగుడైన కొట్రా మహాలక్ష్మయ్యకు మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ ఆదివారం మూడు చక్రాల వాహనం(ట్రై సైకిల్) అందజేసింది. ఇదే గ్రామంలో అస్వస్థతకు గురైన జొన్నకూటి రామకృష్ణకు రూ.4000 ఆర్థిక సాయం అందజేసింది. కార్యక్రమంలో మానవత సంస్థ కన్వీనర్ ఓలిరెడ్డి సతీష్, కనుమూరి ప్రసాద్, తానేటి శేషారావు, పాతంగి ప్రసాద్, మహేష్ పాల్గొన్నారు.అలాగే ఘంటావారిగూడెం అగ్ని ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి నార్సింగ్ ఆర్యన్‌కు మానవత సంస్థ ఆదివారం రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. అతడికి మానవత సంస్థ గ్రామ కన్వీనర్ నాదెళ్ళ శ్రీరామ్మూర్తి, పాలకపాటి ప్రసాద్‌లు రెండు వేలు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు ఐడీవీ అప్పారావు, భోగవల్లి వెంకటసుబ్బారావు, నందం రాజేంద్రప్రసాద్, ఉప్పాడ కామేశ్వరరావు, దావులూరి చిరంజీవి, టీచర్ బొండల శ్రీనివాసరావు, చిటికిన రామారావు పాల్గొన్నారు.

## పోలీసు స్టేషన్ ఎదుట పోతినీడుపాడు దళితుల ఆందోళన



నల్లజర్ల పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న పోతినీడుపాలెం దళితులు

నల్లజర్ల: తమ శ్మశానవాటిక స్థలం ఆక్రమణకు గురైనందున, న్యాయం చేయాలని కోరుతూ సుమారు 100 మంది పోతినీడుపాలెం గ్రామ దళితులు ఆదివారం నల్లజర్ల పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు. ఈ శ్మశాన స్థలం విషయమై గత సెప్టెంబర్‌లో వివాదం జరిగిందని, పది రోజుల్లో సర్దుబాటు చేస్తామని అధికారులు చెప్పినప్పటికీ, ఇప్పటికీ అది కార్యరూపం దాల్చలేదని గ్రామ మహిళలు కరుటూరి వెంకటలక్ష్మి, చెరుకుతోట అచ్చెమ్మ, చేబత్తుల వెంకటనర్సమ్మ తదితరులు ఆరోపించారు. తమ తాతల కాలం నాడు రెండెకరాలు ఉండే శ్మశానవాటిక నేడు 20 సెంట్లకు కుంచించుకుపోయిందన్నారు. ఆదివారం శ్మశానవాటికకు రహదారి ఏర్పాటుకు ఉపక్రమించిన తమపై అగ్రవర్ణ మహిళలు దాడి చేశారని దళిత మహిళలపై ఆరోపించారు. దీనిపై ఇరువర్గాలు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. రెండు రోజుల్లో ఈ సమస్యకు పరిష్కారం చూపుతామని తహసీల్దారు కిశోర్‌కుమార్, సీఐ నున్న రాజు సముదాయించారు. కాగా పోతినీడుపాలెం దళిత నాయకులు గంటా శోభన్ బాబు, గుడెల్లి జిమ్మిరాజు, కె.సుధాకర్‌లు ఆదివారం విజయవాడ వెళ్లి రాజంపేట మిధున్‌రెడ్డిని కలసి సమస్యను వివరించారు. కలెక్టర్‌తో మాట్లాడి వివాదం సర్దుబాటు చేస్తానని ఆయన తమకు హామీ ఇచ్చినట్టు దళిత నాయకులు అక్కడి నుంచి ఫోన్‌లో ఇక్కడి విలేకరులకు తెలిపారు.

# మంచి శిక్షణ ఇస్తే జాతీయ స్థాయికి..

- రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత
- నెట్ శిక్షణ అకాడమీ ప్రారంభం



నెట్ క్రికెట్ అకాడమీని ప్రారంభించాక సరదాగా క్రికెట్ ఆడుతున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ఫ్రెండ్స్ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో యువతకు ఉత్తమ శిక్షణ అందించి, ఈ ప్రాంత క్రీడాకారులు జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో రాణించేలా చూడాలని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. స్థానిక మినీ బైపాస్‌లోని అభ్యాస స్కూల్ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన నెట్ క్రికెట్ అకాడమీని ఆదివారం మంత్రి ఆమె ప్రారంభించారు. అనంతరం మంత్రి వనిత కొద్దిసేపు క్రీడాకారులతో ముచ్చటించారు. అండర్-19 జాతీయ క్రికెట్ జట్టుకు ఆంధ్రప్రదేశ్ నుంచి దొమ్మేరుకు చెందిన ఇమ్రాన్ ఎంపికయ్యాడని కోచ్, ఫ్రెండ్స్ క్రికెట్ అకాడమీ ఫౌండర్ డేగల సత్యమూర్తి మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ ప్రతిభ కలిగిన గ్రామీణ స్థాయి క్రీడాకారులను వెలికి తీసి వారి భవిష్యత్తుకు బాటలు వేయడానికి ఇలాంటి అకాడమీలు ఉపకరిస్తాయన్నారు. జిల్లా స్థాయిలో అండర్-14, అండర్-17,అండర్-19 విభాగాల్లో ఇద్దరు చొప్పున ఆరుగురు బాలులు, అండర్-17 విభాగంలో ఇద్దరు అమ్మాయిలకు కోచ్ సత్యమూర్తి శిక్షణ ఇవ్వడం ఆనందదాయకం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిం చిన సీఎం కప్ పోటీల క్రికెట్ విభాగంలో కొవ్వూరు మూడో స్థానం సాధించడం అభినందనీయం అని ఆమె కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, శ్రీరామ సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, సిద్ధన వాసు, నగళ్లపాటి శ్రీనివాస్, వరిగేటి సుధాకర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో శ్రీరామ శోభాయాత్ర



ఉండ్రాజవరంలో రాములోరి శోభయాత్ర చేస్తూ అక్షతలు పంచుతున్న భక్తులు



వేగేశ్వరపురం శోభాయాత్రలో చిన్నారుల సందడి

తాళ్లపూడి: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) యూత్ ఆధ్వర్యంలో మండలంలోని వేగేశ్వరపురంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను ఆదివారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు, గ్రామస్తులతో ఆ గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. శ్రీరామ కీర్తనలు ఆలపిస్తు వీధుల గుండా సీతారాముల విగ్రహాలతో పల్లకీ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పురాణ ఉపన్యాసకుడు పరస రాధాకృష్ణ, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ బొర్రా శ్రీరామచంద్రమూర్తి, అధిక సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

**ఉండ్రాజవరంలో..**

ఉండ్రాజవరం: శ్రీరామ పూజిత అక్షతల పంపిణీ కార్యక్రమం ఉండ్రాజవరంలో కోలాహలంగా జరిగింది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ ప్రతిష్ఠ అక్షతలను మహిళలు ఆదివారం గ్రామంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు రామ కీర్తనలు ఆలపిస్తూ గడప గడపకూ వెళ్ళి అక్షతలతో పాటు అయోధ్య శ్రీరామ క్షేత్రం ఫొటో, ఆహ్వాన పత్రం అందజేశారు. అయోధ్యలో రామ ప్రతిష్ఠ జరిగే ఈనెల 22 వరకూ ఈ అక్షతలు పూజా గదిలో భద్రపరిచి ఆ రోజు పూజ చేయాలని కోరారు. రామజన్మభూమి సభ్యులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



